క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ 11కేవీ సేవానగర్, కొమ్మాది ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేష్ చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జీసీసీ లే అవుట్, టీచర్స్ లే అవుట్, హౌసింగ్ బోర్డు కాలనీ, అమరావతి నగర్ కాలనీ, సేవానగర్, సాయిరాం కాలనీ డ్రైవర్స్ కాలనీ, కొమ్మాది విలేజ్, దేవిమెట్ట విలేజ్, ఓజోన్ వ్యాలి బ్లాకులు, ఓజోన్ వ్యాలి రోడ్డు మొత్తం, మారికవలస మెట్రో, చైతన్య, పాలాక్స్, గురుకుల కళాశాల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం: మునివానిపేట, సామయ్యవలస, పాండ్రంగి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఆయన తెలిపారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలి పరిధిలో కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపులు జరుగున్ననాయని వీటి కోసం అర్హులు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ పిన్నింటి శ్రీనివాస్ గురువారం తెలిపారు. జీవీఎంసీ పరిధిలో మొత్తం 11 షాపులు కేటాయిస్తుండగా, భీమిలి, ఆనందపురం, పద్మనాభం పరిధుల్లో ఒక్కొక్క దుకాణాన్ని కేటాయించారని తెలిపారు. ఆసక్తిగలవారు రూ.2 లక్షలు ధరావత్తు చెల్లించి ఫిబ్రవరి 5వతేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చని, 7వ తేదీన కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా నిర్వహించి ఎంపికైన వారికి షాపులను కేటాయిస్తారని వెల్లడించారు.


కుక్కల దాడిలో దూడ మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన దూడ

భీమునిపట్నం: భీమిలిలో వీధికుక్కల దాడి చేయడంతో గురువారం ఆవుదూడ చనిపోయింది. ఇక్కడి గ్రామదేవత నూకాలమ్మవారి ఆలయం వద్ద ఉదయం ఆరుగంటల ప్రాంతంలో సుమారు పది కుక్కలు దూడపై దాడి చేసి హతమార్చాయి. కొద్ది సేపటికి అటుగా వచ్చిన కొందరు వాటిని తరిమేశారు. కొద్ది నెలలుగా ఇక్కడ వీధికుక్కల సంఖ్య బాగా పెరిపోవడంతో తరచూ పలువురిపై దాడి చేస్తున్నాయి. అధికారులు స్పందించి వీధికుక్కలను నిర్మూలించాలని పలువురు కోరుతున్నారు.

జీవీఎంసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



జోనల్ ఆఫీసులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్-2 కార్యాలయంలో ఉద్యోగులకు ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఇక్కడ ఉద్యోగులు, సిబ్బంది, అధికారులకు పరీక్షలు నిర్వహించారు.

గీతంలో అట్టహాసంగా 'జెమ్-25'



కార్యక్రమం ప్రారంభిస్తున్న పర్యావరణవేత్త ఆనంద్

కొమ్మాది: వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థుల్లో న్యాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీయడానికి గీతం మూడు రోజులు పాటు నిర్వహిస్తున్న గీతం ఎక్స్‌లెన్స్ మీట్-25 (జెమ్) గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. పర్యావరణవేత్త ఎం.ఆనంద్ ఈ కార్యక్రమం ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. దేశంలో ఆక్రమణలకు, నిర్లక్ష్యానికి గురవుతున్న నీటి చలములు, సరస్సులను పునరుద్ధరించడానికి తాను చేస్తున్న కృషిలో యువత భాగస్వామి కావాలన్నారు.

బొగ్గే.. బంగారమాయే!

నల్లబంగారంగా పిలిచే బొగ్గు.. నిజంగానే బంగారమైంది. బొగ్గు తయారీ కేంద్రాలు మూతపడుతుండడంతో దీనిపై ఆధారపడే చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాలు, తోటల్లో బట్టీలను నెలకొల్పి కట్టెలను కాల్చి బొగ్గు చేసే వారు. అయితే నానాటికీ ఈ బట్టీలు కనుమరుగవుతున్నాయి. కట్టెలే బొగ్గు తయారీకి ఆధారం. ప్రస్తుతం అవి దొరకడం లేదు. ఒకవేళ దొరికినా ధర ఆకాశాన్ని అంటుతోంది. భీమిలి నియోజకవర్గంలో గతంలో ఎక్కడిపడితే అక్కడ బొగ్గుల ఉత్పత్తి జరిగేది. ప్రస్తుతం ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పందలపాక, కొవ్వాడ, కుసులవాడ పంచాయతీల్లో పదుల సంఖ్యలో బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు.

-తగరపువలస



తయారైన బొగు

ఒకప్పుడు నియోజకవర్గంలో విరివిగా బొగ్గు ఉత్పత్తి • నేడు రెండు మండలాల్లో మాత్రమే...

సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కి కట్టెల పొయ్యి, బొగ్గుల కుంపటికి ప్రత్యామ్నాయంగా గ్యాస్, ఇండక్షన్, సోలార్ ప్రవేశించినా బొగ్గులకు ఉన్న ప్రాధాన్యత తగ్గలేదు. గతంలో టీ కాచుకోవాలన్నా, వంట చేసుకోవాలన్నా చివరకు పళ్లు తోముకోవాలన్నా బొగ్గులనే వినియోగించేవారు. అప్పుడే జన్మించిన చిన్నారులకు ఆరు నెలలు వచ్చే వరకు బొగ్గుల కుంపటి ఆధారంగా కాపడం పెట్టేవారు. చలికాలం వచ్చిందంటే చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వెచ్చదనం కోసం మంచం కింద బొగ్గుల కుంపటి ఉండవలసిందే. మూడున్నర దశాబ్దాలుగా కట్టెలు, బొగ్గుల పొయ్యిలకు ప్రత్యామ్నాయంగా తేలికగా వంట పూర్తయ్యే గ్యాస్ స్టౌలు విరివిగా ప్రవేశించాయి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం బొగ్గుల పొయ్యిలు కనుమరుగు కావడంతో ఇప్పటి తరానికి బొగ్గుల ఉత్పత్తి గురించి అంతగా తెలియదు. కట్టెలు కాలిస్తే బొగ్గులు వస్తాయని తెలిసినా సకాలంలో ఆర్పకపోతే బూడిదే మిగులుతుంది. ఇంట్లో, గుడిలో దేవునికి దూపం వేయాలంటే బొగ్గుల కోసం దేవులాట తప్పడం లేదు.



పందలపాకలో బట్టీలలో తయారవుతున్న బొగ్గు



బొగ్గు తయారీకి ముడిసరుకుగా వినియోగిస్తున్న కలప



బట్టీలో వినియోగానికి అరటి చెట్ల వ్యర్థాలు

తయారీ చాలా కష్టం..

కలప లభించే ఆయా ప్రాంతాలను బట్టి అధిక సొమ్ము వెచ్చించి బట్టీల వద్దకు తరలించుకురావలసి ఉంటుంది. బట్టీలో లేయర్లుగా కలప, మట్టి, అరటి చెట్ల వ్యర్థాలతో పాటు పచ్చని చెట్ల కొమ్మలు వేసి పన్నెండు అడుగుల పొడవుగా నిర్మిస్తారు. చివరగా వీటికి మంట పెట్టి కలప పూర్తిగా బూడిద కాకుండా నీళ్లతో తడుపుతూ 20 రోజులు మండే కళ్లతో ఎదురు చూడాలి. ఈ సమయంలో ప్రతి గంటా విలువైనదే. ఏ మాత్రం ఏమరపాటు ఉన్నా బూడిదే మిగులుతుంది. పూర్వం అటవీ ప్రాంతంలో బొగ్గుల బట్టీలు ఉండేవి. అగ్నిప్రమాదాల కారణంగా అక్కడ నిషేధం విధించడంతో ప్రస్తుతం శివారు ప్రాంతాలలో బొగ్గు తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వర్షాలు కురిస్తే పరదాలు వంటి అదనపు ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం 5 కిలోల బొగ్గుల బస్తా రూ.100, రెండో రకం 40 కిలోల బస్తా రూ.600 వరకు విక్రయిస్తున్నారు.

ఇదే జీవనోపాధి

బయట వేరే వాళ్ల దగ్గర ఇతర పనులకు వెళ్లే బదులుగా మా పూర్వీకుల నుంచి ఇదే జీవనోపాధిగా కొనసాగిస్తున్నం. కాలాలు మారుతున్నా బొగ్గుకు ఉన్న ప్రాధాన్యత తగ్గలేదు. ఒక్కోసారి కలప తేలికగా దొరికితే మరోసారి చాలా దూరం వెళ్లవలసి ఉంటుంది. అప్రమత్తంగా ఉంటే నష్టాలు వచ్చేది చాలా తక్కువ.



-పైల అప్పారావు, బొగ్గు తయారీదారుడు

కష్టపడితే నల్లబంగారమే..

బొగ్గుల తయారీకి కుటుంబం మొత్తం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూడవలసి ఉంటుంది. మేము పెద్దగా చదువుకోకపోవడంతో మరో వ్యాపకం చేతకాదు. ఏడాది పొడవునా ఉపాధి లభించే ఇందులో లాభాలు వస్తే బొగ్గు మా పాలిట నల్ల బంగారమే.



-పైల పెద అప్పారావు, తయారీదారుడు

సాక్షి మ్యాథ్స్ బీఈఈలో వివేక్‌కు ఫస్ట్ ర్యాంక్



ఫస్ట్ ర్యాంక్ సాధించిన వివేక్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

తగరపువలస: ఈ నెల 23న హైదరాబాద్‌లో సాక్షి దినపత్రిక రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నిర్వహించిన మ్యాథ్స్ బీఈఈ కేటగిరీ-4 ప్రతిభ పరీక్షలో ఆనందపురం కేకేఆర్ గౌతమ్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఆర్.వివేక్ రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా నిర్వాహకులు విద్యార్థికి ప్రశంసాపత్రంతో పాటు రూ.8 వేలు ప్రోత్సాహక బహుమతి, బంగారు పతకం అందించారు. ఇదే పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి బి.దశరథ రాష్ట్ర స్థాయిలో కేటగిరీ-3లో 4వ ర్యాంకు, డి.శర్వాణ్ 5వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఈ విద్యార్థులను డైరెక్టర్ అవినాష్, డీన్ శేషుబాబు, మ్యాథ్స్ జోనల్ హెచ్‌వోడీ కేవీఆర్ మూర్తి, ప్రిన్సిపాల్ పి.వైకుంఠరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పౌష్టికాహార కిట్ల అందజేత

మధురవాడ: టీబీ పేషెంట్లకు మధురవాడ పీహెచ్‌సీలో వైద్యాధికారి ప్రశాంతి గురువారం పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఇక్కడ చికిత్స పొందుతున్న 40 మందికి నేషనల్ అల్యూమినియం కార్పొరేషన్ లిమిటెడ్ (నాల్కో) సమకూర్చిన ఆయిల్, చక్కి, కంది పప్పు, వేరుశనగ పప్పు తదితర 7 రకాల వస్తువలుతో కూడిన కిట్‌ను అందజేశారు.కార్యక్రమంలో టీబీ సూపర్ వైజర్ వీరబ్రహ్మం, సీహెచ్‌వో సౌభాగ్యమణి, సురేష్, అనూష తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం గురువారం అమనాం, పోలిపల్లి, మహరాజుపేట జెడ్పీ హైస్కూళ్లకు చెందిన 95 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏఆర్ విజయకుమారి, ఇందిర, ప్రసాద్, దివీస్ ప్రతినిధి ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నవరంలో ఉద్రిక్తత

- 199.28 ఎకరాల విషయంలో రైతుల మధ్య కొట్లాట



అన్నవరంలో వివాదాస్పదమైన స్థలంలో తూడెం రైతులు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీ సర్వే నంబర్ 101/1లో వివాదాస్పదమైన 199.28 ఎకరాలకు సంబంధించిన డీ పట్టా భూముల వ్యవహారంలో గురువారం ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ప్రస్తుతం విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో ఉన్న తూడెం పంచాయతీ 1979కు ముందు భీమిలి మండలంలో ఉండేది. ఈ సర్వే నంబర్‌లో వందల ఏళ్ల నుంచి రైతులు తోటపంటలు సాగు చేసుకుంటున్నారు. ఇటీవల భీమిలి మండలంలోని అన్నవరం, భోగాపురం మండలం తూడెంలోని రైతుల మధ్య ఈ భూమికి సంబంధించి వివాదం మొదలయింది. దీంతో కొందరు రైతులు కోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో తెచ్చుకున్నారు. మరికొందరు విజిలెన్స్ విభాగాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో వీఎంఆర్డీఏ తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ సర్వే చేయడానికి గానూ గురువారం ఈ వివాదాస్పదమైన భూముల్లోకి రాగానే.. తూడెం పంచాయతీకి చెందిన రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట, కొట్లాట ప్రారంభమయింది. ఈ క్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్ అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఇరువర్గాలకు చెందిన 300 మంది రైతులు ఈ ప్రాంతంలో ఉన్నారు. అయినప్పటికీ భీమిలి, భోగాపురం మండలాల నుంచి ఎలాంటి పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది రాకపోవడం గమనార్హం. ఈ తోపులాటలో పలువురు గాయపడ్డారు. దీంతో పరస్పరం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీనిపై వేణుగోపాల్ మాట్లాడుతూ ముందు రోజు రైతులకు ఇచ్చిన సమాచారం మేరకు తాను సర్వేకు వెళ్లినట్టు తెలిపారు.

మొక్కజొన్నకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

పద్మనాభం: మొక్కజొన్న పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు ఎం.విశాలాక్షి, ఎ.శిరీష అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో గురువారం మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ మొక్క జొన్న వేసిన 15 రోజులకు క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ మీటర్ల మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వేసిన 40 రోజులకు ఎమా మెక్సిన్ బెంజియేట్ నాలుగు గ్రాముల మందును పది లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఏవో ఎంవీఎస్ చలం పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు... అండగా ఉంటాం

- కార్యకర్తలకు భరోసా
- భారీ బైక్ ర్యాలీతో వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావుకు స్వాగతం
- కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



గాంధీజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, గుడివాడ్ అమర్‌నాథ్, ధర్మశ్రీ

పద్మనాభం: వైఎస్సార్ సీపీ అధికారంలో లేదని కార్యకర్తలు అధైర్య పడొద్దని.. ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామని భీమిలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో గురవారం జరిగిన పద్మనాభం మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేయడమే ధ్యేయంగా సమష్టిగా పనిచేద్దామన్నారు. కార్యకర్తలు, నాయకులతో మమేకమై భీమిలి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని ముందుకు నడిపిస్తానన్నారు. తాను కార్యకర్తల వెన్నంటే ఉంటానన్నారు. కూటమి ప్రభుత్వం తమ అనుచరులు, సంపన్నుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో భయపెట్టాలని చూస్తోందన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో గ్రామాలు, కుటుంబాలు, మహిళలు ఆర్థిక పరిపుష్టితో ఉండేవారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో రూ.5 నుంచి రూ10 వడ్డీకి అప్పులు తెచ్చుకునే పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్ నాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేనందున హామీలను నెరవేర్చలేమని సాక్షాత్తు చంద్రబాబే చెప్పారన్నారు. సంక్రాంతి పండగ నాటికి రోడ్ల గుంతలు పూడ్చుతామని చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. రెడ్డిపల్లి రోడ్డు పెద్ద పెద్ద గోతులు పడి వర్షం పడితే వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గానికి సమన్వయ కర్తగా సమర్థవంతమైన నాయకుడైన మజ్జి శ్రీనివాసరావును వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నియమించారన్నారు.

గాంధీజీకి ఘన నివాళి

గాంధీజీ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు,అనకాపల్లి పార్లమెంటరీ నియోజక వర్గ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ తదితరులు ఘన నివాళులర్పించారు. అంతకుముందు మజ్జి శ్రీనివాసరావు కుంతీ మాధవ స్వామి ఆలయంలో మాధవ స్వామి, అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ బైక్ ర్యాలీతో మజ్జి శ్రీనివాసరావును రెడ్డిపల్లి సభా స్థలికి కార్యకర్తలు తీసుకువెళ్లారు. బాణసంచా కాల్చారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్ సీపీ ఆనందపురం మండల శాఖ అధ్యక్షుడు బంక సత్యం, భీమిలి మండల శాఖ అధ్యక్షుడు గాడు శ్రీనివాసరావు , నాయకులు సిరుగుడి ఆదినారాయణ, సుంకర బంగారప్పుడు, అముజూరి అప్పారావు, బుగత సత్యనారాయణ, పలు గ్రామాలు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మహాత్మునికి ఘన నివాళులు



బీచ్ పార్కువద్దనున్న మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామ పెద్దలు

భీమునిపట్నం: భీమిలిలోని మూడో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. బీచ్ పార్కు వద్దనున్న మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజి, రామసూరప్పడు, రాంభక్త ప్రభాకర్‌నాయుడు, రమణారెడ్డి, చెల్లూరి గౌరినాయుడు, సంజీవరావు, వాడమొదల జగ్గారావు, గేదెల సత్యన్నారాయణ, శంకరరావు, జగదీష్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో..

మధురవాడ: పలు ప్రాంతాల్లో మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మధురవాడలోని చంద్రంపాలెం, స్వతంత్రనగర్, మిథిలాపురి వుడా కాలనీ గాంధి సర్కిల్ తదితర ప్రాంతాలలో జాతిపిత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు పిల్లా కృష్ణమూర్తిపాత్రుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు పిళ్లా సూరిబాబు, నాయకులు పీవీజీ అప్పారావు, జగ్గుపిల్లి నరేష్, పిళ్లా చంద్రశేఖర్, పోతిన పైడిరాజు, పిళ్లా అప్పన్న, పిళ్లా పోతరాజు, పీస రామారావు పాల్గొన్నారు.
- మధురవాడ పౌరసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వతంత్రనగర్ గల గాంధీ విగ్రహం వద్ద అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ నాయుడు, కార్యవర్గ సభ్యులు జగన్‌మోహనచౌదరి, బెల్లాపు పాపారావు, రమణ, బైపిల్లి సతీష్‌కుమార్, దువ్వి శ్రీనివాసరెడ్డి, కావ్యారెడ్డి, శంకరరావు తదితరులు గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

జాతిపితకు పలువురు నివాళులు

తగరపువలస: భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమిలి మండలం తాటితూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు కరుభుక్త సన్యాసినాయుడు నివాళులర్పించారు. శింగనబంధ పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గొట్టిపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు.



ఆదర్శహిందీ ప్రేమీమండలి ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఎట్టకేలకు విద్యుత్ పునరుద్ధరణ




ఆనందపురం పంచాయతీ సర్వే నంబర్ 139లో పునరుద్ధరిస్తున్న విద్యుత్ వైర్లు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ఎట్టకేలకు 57 రోజుల తరువాత ఆనందపురం ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ సిబ్బంది రైతుల సమస్యలపై స్పందించారు. ఆనందపురం మండలం అదే పంచాయతీలోని సర్వే నంబర్ 139లో గత ఏడాది డిసెంబరు 5న దొంగలు విద్యుత్ స్తంభాలకు చెందిన 500 మీటర్ల అల్యూమినియం వైర్లు కట్ చేసి పట్టుకుపోయారు. అప్పటి నుంచి స్థానిక రైతుల వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయి పంటలు ఎండిపోయి రూ.లక్షలలో నష్టం వాటిల్లింది. దీంతో బాధిత రైతులు అధికారులు చాలా సార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. దీంతో ఈ నెల 21న సాక్షిలో 'ఇంత నిర్లక్ష్యమా?' శీర్షికతోను, 29న 'రైతులకు చుక్కలు చూపిస్తున్నారు' శీర్షికతో కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో ఏపీఈపీడీసీఎల్ అధికారులు 29న ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. చోరీకి గురైన వైర్లకు ప్రత్యామ్నాయంగా గురువారం కొత్త వైర్లతో లైను పునరుద్ధరించారు. దీంతో 57 రోజుల విరామం అనంతరం వ్యవసాయ మోటార్లు పనిచేయడంతో స్థానిక రైతుల ఆనందం వ్యక్తం చేశారు.

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

- విశ్వామిత్రుని చరిత్రే నిదర్శనం
- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



ప్రవచనాలు చెబుతున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: పట్టుదలతో ఏదైనా సాధించవచ్చునని అనడానికి విశ్వామిత్రుని చరిత్ర ఓ ఉదాహరణ అని, ఇటువంటి అనేక విషయాలు శ్రీరామాయణం బోధిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో శ్రీ అష్టలక్ష్మి, శ్రీవైశాఖేశ్వర స్వామి ఆలయం, గాయత్రి విద్యాపరిషత్‌లు సంయుక్త ఆధ్వర్యంలో సంపూర్ణ రామాయణంపై ఏర్పాటు చేసిన ప్రవచానాలలో భాగంగా గురువారం 6వ రోజు ప్రవచించారు.

విశ్వామిత్రుని వల్ల తల్లి అహల్య శాపవిమోచనం పొందిందనే విషయం తెలుసుకున్న ఆనందంలో శతానందుడు విశ్వామిత్ర మహర్షి గొప్పతనం రామలక్ష్మణులకు వివరించారు. ఎన్ని తరాలు మారిగా అందరికీ గొప్ప ఆదర్శప్రాయుడని, విశ్వామిత్ర మహర్షి చరిత్ర తెలుసుకున్న తర్వాత శ్రీరాముడు ప్రభావితం అయిన తీరు తదితర విషయాలు వివరించారు. నిర్వాహకులు అష్టలక్ష్మి దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యన్నారాయణమూర్తి దంపతులు, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి విజయ తరఫున ప్రచారం

తగరపువలస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం సీఐటీయు నాయకులు పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్, భీమిలి కేజీబీవీలలో నిర్వహించిన ప్రచారంలో జీవీఎంసీ పార్టీ ఫ్లోర్ లీడర్ గంగారావు, భీమిలి జోన్ కన్వీనర్ ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

పాత కక్షలతో కొట్లాట

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో ఇద్దరి మధ్య పాత కక్షల నేపథ్యంలో దాడులు చేసుకున్నారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ పరిధి పుక్కళ్లపాలెంలో పుక్కళ్ల దాసు, వాసుపల్లి నవీన్ నివాసం ఉంటున్నారు. వీరి మధ్య కుటుంబ గొడవలున్నాయి. సెలూన్ షాప్‌లో ఉపయోగించే చాకుతో బుధవారం రాత్రి వాసుపల్లి నవీన్‌పై దాసు దాడి చేశారు. దీంతో నవీన్ కాళ్లకు, వీపుపైన బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. గురువారం ఉదయం నవీన్ కుటుంబ సభ్యులు భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై హరీష్ కేసు నమోదు చేసి దాసును అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.